నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 28 సెప్టెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద

హాజపూర్, సెప్టెంబర్ 27 : ఎగువన కురుస్తున్న వర్షాలకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 147.93 మీటర్ల వరకు నీరు ఉంది. 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 19.7586 టీఎంసీల నీటి మట్టం ఉంది. 1,47,358 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శుక్రవారం 16 గేట్లు ఎత్తి 1,62,502 క్యూ సెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు


ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరద

## విద్యుత్ ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

**ఉత్తర్వులు వెలువరించిన సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి**


మంచిర్యాలటౌన్, సెప్టెంబర్ 27: విద్యుత్ ఉద్యోగుల బదిలీలకు ఉన్నతాధికారులు పచ్చజెండా ఊపారు. ఈ మేరకు శుక్రవారం టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. 30-6-2024 నాటికి ఒకే ప్రాంతంలో రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారు బదిలీకి దరఖాస్తు చేసుకునే వీలుంది. ఆయా సర్కిళ్ల పరిధిలో బదిలీలు నిర్వహించనున్నారు. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే వేరే సర్కిల్‌కు బదిలీ చేసే అవకాశమున్నది. ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ సిబ్బంది, లైన్‌మెన్ ఉద్యోగులకు మ్యానువల్ పద్ధతిలో బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏఈలు, ఏడీఈ, డీఈ స్థాయి ఉద్యోగులు మాత్రం వెబ్ ఆప్షన్ ద్వారా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు బదిలీలపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియపరచాల్సి ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వరకు ఎంప్లాయిస్ పోర్టల్‌లో ఆప్షన్స్‌ను పొందుపరచాలి. అక్టోబర్ 7న బదిలీల ఉత్తర్వులు అందజేస్తారు. 10న బదిలీ అయిన ఉద్యోగులు వారికి కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది. కాగా, బదిలీలకు సంబంధించిన గైడ్‌లైన్స్ వెలువడిన నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

## మంచిర్యాల బల్దియాలో రూ. 9.60 లక్షలు స్వాహా

- పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును కాజేసిన ఉద్యోగి
- ఏడాదిన్నరగా సొంతానికి వాడుకుంటున్న వైనం
- బండారం బయట పడ్డాక తిరిగి చెల్లింపు
- కేవలం సెక్షన్ మార్చి చేతులు దులుపుకున్న అధికారులు

మంచిర్యాల టౌన్, సెప్టెంబర్ 27 : మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేసే ఓ ఉద్యోగి పన్నుల రూపంలో వసూలు చేసిన రూ. 9.60 లక్షలను స్వాహా చేయడం కలకలం రేపుతున్నది. ఈ విషయం ఏడాదిన్నర తర్వాత బయటకు రావడం.. అధికారులు సంబంధిత ఉద్యోగిపై ఒత్తిడి తేవడం.. ఆయన తిరిగి డబ్బులు చెల్లించడం స్థానికంగా చర్చనీయాంశమవుతున్నది. ఎన్‌ఎంఆర్ ఉద్యోగి అయిన నర్సింగరావుకు క్యాషియర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. 2023 మార్చిలో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగి యాకూబ్ బదిలీపై వేరే మున్సిపాలిటీకి వెళ్లాడు. ఆ సమయంలో అతనికి పన్నుల వసూలు కోసం అప్పగించిన హ్యాండ్ హెల్డ్ మిషన్‌ను రెవెన్యూ సెక్షన్‌లో అప్పగించాడు. ఆ మిషన్‌ను రెవెన్యూ సెక్షన్‌లో పనిచేసే ఓ అధికారి తిరిగి నర్సింగరావుకు అప్పగించాడు. దానికి మరమ్మతులు చేసి తన వద్దే ఉంచేసుకున్నాడు. మున్సిపాలిటీ పరిధిలో 16 హ్యాండ్ హెల్డ్ మిషన్లు ఉన్నాయి. మరో రెండు మరమ్మతుల పేరిట పక్కన ఉంచారు. కానీ యాకూబ్ అనే ఉద్యోగి ఇక్కడ అప్పగించి వెళ్లిన హ్యాండ్ హెల్డ్ మిషన్ మాత్రం రికార్డుల్లో మరమ్మతుల లిస్టులో ఉంది. దీనిని ఆసరాగా చేసుకున్న నర్సింగరావు ఈ మిషన్ ద్వారా పన్నులు వసూళు చేశాడు. అలా 2023 ఏప్రిల్ నుంచి 2023 నవంబర్ వరకు ఆ మిషన్‌ను ఉపయోగించి పన్నులు వసూలు చేశాడు. అలా వసూలైన సొమ్మును ఏరోజుకారోజు మున్సిపాలిటీ అకౌంట్‌లో జమచేయాల్సి ఉండగా, తన సొంతానికి వాడుకున్నాడు. ఇటీవల అకౌంట్స్ సెక్షన్‌లోకి కొత్తగా వచ్చిన సిబ్బంది డిబాస్ సైట్‌లో తనిఖీలు చేస్తుండగా యాకూబ్ పేరిట ఉన్న హ్యాండ్ హెల్డ్ మిషన్ నుంచి పన్నులు వసూళ్లు చేసినట్లు గుర్తించారు. ఈ విషయం వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నర్సింగరావుపై ఒత్తిడి తేవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తిరిగి ఆ సొమ్మును మున్సిపాలిటీకి చెల్లించాడు. అయితే అక్రమాలకు పాల్పడ్డట్లు తేలినా సదరు ఉద్యోగిని కేవలం సెక్షన్ మార్చి చేతులు దులుపుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. మున్సిపల్ అధికారుల పాత్ర కూడా ఉండి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా పలువురు ఉద్యోగులు బిల్లులు రాసే రసీదు పుస్తకాలను మాయం చేశారు. అందులో శాశ్వత ఉద్యోగులు ఇద్దరు వారు వసూలు చేసిన సొమ్మును తిరిగి చెల్లించారు. కాంట్రాక్టు సిబ్బంది పుస్తకాలను ఇంకా సమర్పించలేదు. వారు ఎంత వసూలు చేశారన్న విషయం తేలలేదు. ఈ విషయంలో రీజినల్ డైరెక్టర్ విచారణకు అప్పట్లో విచారణకు ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది.



హ్యాండ్ హెల్డ్ మిషన్

# అట్ల అరెస్టు చేసి.. ఇట్ల వదిలేసిన్రు!

**శనిగకుంట మత్తడి పేల్చివేత కేసులో పోలీసుల దోబూచులాట**

- శుక్రవారం ఉదయం కాంగ్రెస్ లీడర్లను పట్టుకెళ్లిన పోలీసులు
- దాదాపు 300 మందితో పోలీస్‌స్టేషన్‌కు తరలి వచ్చిన అధికార పార్టీ నేతలు
- వెంటనే వదిలిపెట్టిన వైనం.. ఖాకీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- విచారణ కోసమైతే తెల్లవారుజామునే తీసుకెళ్లాల్సిన అవసరమేమిటని చర్చ
- ఎమ్మెల్యే వివేక్ ఇచ్చిన మాటకు కట్టుబడతారా.. లేక షాడో ఎమ్మెల్యేకు లొంగిపోతారా..!

మంచిర్యాల, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : శనిగకుంట మత్తడి పేల్చివేత కేసుతో చెన్నూర్ కాంగ్రెస్ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఘటనలో శుక్రవారం తెల్లవారుజామున కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు.. ఆపై కొద్ది సేపటికే నాటకీయ పరిణామాల మధ్య వారిని వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 16న శనిగకుంట చెరువు మత్తడి పేల్చిన కేసులో పెండ్యాల లక్ష్మీనారాయణ(లక్ష్మణ్), భీం మధుకర్, రాసమల్ల శ్రీనివాస్, గోగుల దానయ్యను పోలీసులు అరెస్టు చేశారు. శనిగకుంట చెరువు బఫర్‌జోన్‌లోని 15.20 ఎకరాల్లో మట్టిపోసి.. చెరువులోని నీరు తమ భూముల్లోకి రాకూడదనే ఉద్దేశంతో అధికారపార్టీ నాయకులే పైన పేర్కొన్న నలుగురిని రెచ్చగొట్టి మత్తడి పేల్చివేశారనే చర్చ నడిచింది. ఈ కేసులో అసలైన సూత్రదారులు కాంగ్రెస్ పార్టీ లీడర్లను వదిలేసి, అమాయకులైన స్థానిక కౌన్సిలర్ భర్త లక్ష్మణ్ సహా మరి కొందరిని అరెస్టు చేశారనే విమర్శలు వచ్చాయి. పోలీసుల తీరుపై 'నమస్తే తెలంగాణ'తో పాటు ఇతర పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం, పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకున్నది. టాస్క్‌ఫోర్స్‌ను సైతం రంగంలోకి దించింది. కేసు పూర్వాపరాలు, అదుపులో ఉన్న వారు విచారణలో వెల్లడించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఇందుకు కారకులైన వారిని గురువారం రాత్రే అదుపులోకి తీసుకున్నది. గొడిశెల బాపురెడ్డి, బత్తుల సమ్మయ్య, రాంలాల్ గిల్డాలను తీసుకెళ్లిన టాస్క్‌ఫోర్స్ అధికారులు విచారణ అనంతరం వారిని వదిలిపెట్టారు. ఇళ్లలోనే ఉండాలని.. రేపు వస్తామని చెప్పి వెళ్లిపోయినట్లు తెలిసింది. కానీ ఈ విషయాన్ని అధికారికంగా ఎవరూ ధ్రువీకరించలేదు.

### పోలీసుల యాక్షన్..

టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగిందనో.. లేకపోతే విచారణలో భాగంగానే చేశారో తెలియదు కానీ.. శుక్రవారం ఉదయం చెరువు బఫర్‌జోన్‌లో మట్టిపోసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నాయకులను అరెస్టు చేయాలని పోలీసులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ మేరకు బృందాలుగా ఏర్పడి శుక్రవారం 4 గంటలకే వారి ఇళ్లకు వెళ్లారు. మొత్తం 10 మందిలో కాంగ్రెస్ లీడర్లు బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్ సహా రియల్ ఎస్టేట్ వ్యాపారిగా చెబుతున్న లక్కం రాజబాబు మాత్రమే పోలీసులకు దొరికారు. బాపురెడ్డితో గురువారం టాస్క్‌ఫోర్స్ విచారణకు హాజరైన బత్తుల సమ్మయ్య, రాంలాల్ గిల్డా సహా మిగిలిన వారెవరూ కూడా ఇండ్లలో లేరని తేలిసింది. పోలీసులు వెళ్లిన సమయంలో ఇంట్లోనే ఉన్న గొడిశెల బాపురెడ్డి బట్టలు వేసుకొని వస్తానని లోపలికి వెళ్లి గోడదూకి పారిపోయేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. గమనించిన పోలీసులు స్థానిక చౌరస్తాలో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడి నుంచి ఆయనను నేరుగా జైపూర్‌కు తీసుకెళ్లి.. కాసేపటికే చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.


బాంబులతో పేల్చివేసిన శనిగకుంట చెరువు మత్తడి (ఫైల్ )

### బ్లాక్ మెయిల్ చేసి బయటికి వచ్చారా..!

కాంగ్రెస్ నాయకులు గొడిశెల బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్‌ను పోలీసులు తీసుకెళ్లిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ లీడర్లు వందల సంఖ్యలో ఉదయం 10.30 గంటలకే చెన్నూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మూల రాజిరెడ్డి పోలీసులతో మాట్లాడారు. వారెంట్ ఇచ్చి తీసుకెళ్లకుండా ఇంటి మీదకు వచ్చి దౌర్జన్యంగా తీసుకువెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. ఎక్కడికి.. ఏమిటో చెప్పకుండా ఎలా తీసుకువస్తారని నిలదీశారు. దీంతో పోలీసులు చేసేదేమీ లేక బాపురెడ్డి, పెద్దింటి శ్రీనివాస్‌ను వదిలివేశారు. కాంగ్రెస్ నాయకులు దాదాపు 300 మంది ఈ సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. మా నాయకులను వదిలేయకపోతే ధర్నా చేస్తామని వారు హెచ్చరించినట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో పోలీసులకు ఎమ్మెల్యే వివేక్ నుంచి సైతం ఫోన్ వచ్చిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ లీడర్లను అరెస్టు చేయడం ఏమిటి.. ఇలా చేస్తే మేమంతా పార్టీకి రాజీనామా చేస్తామని స్థానిక లీడర్లు ఎమ్మెల్యేను బ్లాక్ మెయిల్ చేశారని, ఆ ఒత్తిడితోనే పోలీసులు పట్టుకున్న వారిని వదిలివేశారనే చర్చ స్థానికంగా నడుస్తున్నది. ఈ విషయంపై చెన్నూర్ సీఐ రవీందర్‌ను వివరణ కోరగా.. విచారణ కోసమే వారిని తీసుకువచ్చామని చెబుతున్నారు. కాకపోతే కేవలం విచారణ కోసమైతే తెల్లవారు జామున ఇళ్లలోకి వెళ్లి మరీ అరెస్టు చేయాల్సిన అవసరం ఏమిటి.. ఉదయం రమ్మంటే వాళ్లే వచ్చేవారు కదా.. అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రిమాండ్ కోసమే వారిని అరెస్టు చేశారని, కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే వదిలివేసి విచారణ కోసం తీసుకువచ్చామని పోలీసులు చెబుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అసలు ఎందుకు అరెస్టు చేశారు. ఎందుకు వదిలివేశారో సమాధానం చెప్పాలనే డిమాండ్‌లు స్థానికంగా వినిపిస్తున్నాయి.

### ఇంతకు ముందు వారెంట్ ఇచ్చే అరెస్టు చేశారా..

కాంగ్రెస్ లీడర్ల అరెస్టుతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆ పార్టీ నాయకులు వారెంట్ ఇచ్చి తీసుకెళ్లాలని మాట్లాడితే.. పోలీసులు వదిలేశారని చెబుతున్నారు. అసలు శనిగకుంట మత్తడి పేల్చివేతపై ఇరిగేషన్ అధికారులు కేసు పెట్టారు. ఈ మేరకు స్థానిక కౌన్సిలర్ భర్త లక్ష్మణ్‌తో పాటు మరోముగ్గురిని అరెస్ట్ చేశారు. వీరి అరెస్టును చూపించిన రోజు సైతం మీడియాకు డీసీపీ భాస్కర్ విచారణ ఇంకా కొనసాగుతుందని చెప్పారు. 15.20 ఎకరాల చెరువు బఫర్ జోన్‌లో మట్టి పోశారని కూడా ఆయనే చెప్పారు. ఈ క్రమంలో ముందు అరెస్టైన నలుగురు విచారణలో బాపురెడ్డి సహా ఇందులో ప్రమేయం ఉన్న అందరి పేర్లు చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. పక్కా సమాచారంతోనే పోలీసులు శుక్రవారం ఉదయాన్నే అరెస్టు చేసినట్లు.. కానీ కాంగ్రెస్ లీడర్ల జోక్యంతో వెనక్కి తగ్గారని తెలుస్తున్నది. అంతకు ముందు అరెస్టు చేసిన నలుగురిని వారెంట్ ఇచ్చి అరెస్టు చేశారా.. కాంగ్రెసోళ్లకు మాత్రమే వారెంట్ ఎందుకు అనేది అర్థం కావడం లేదు. ఏ తప్పు చేయకపోతే ఎందుకు అంతగా భయపడుతున్నారు అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరి పోలీసులు ఈ వ్యవహారంపై రానున్న రోజుల్లో ఎలా స్పందిస్తారనేది వేచి చూడాల్సి ఉంది.

## షాడోతో డీల్ సెట్ కాలే.. అరెస్టు కూడా నాటకమే..!

ఈ మొత్తం వ్యహారంలో చెన్నూర్ శివారులో ఫంక్షన్ హాల్ కలిగిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు (ఈయన్ని షాడో ఎమ్మెల్యే అంటారు) పావులు కదుపుతున్నట్లు తెలుస్తున్నది. శనిగకుంట చెరువు బఫర్ జోన్‌లో ఇప్పుడు ఎక్కడైతే మట్టి పోశారో ఆ 15.20 ఎకరాల్లో ఈ షాడో 25 శాతం వాటా అడిగినట్లు సమాచారం. దీనికి బాపురెడ్డి ఒప్పుకోలేదని.. అప్పటి నుంచి ఆయన ఎక్కడ దొరుకుతాడా అని సదరు నాయకుడు ఎదురు చూస్తున్నట్లు సమాచారం. ఈ లోగా శనిగకుంట మత్తడి పేల్చివేతలో బాపురెడ్డి పేరు రావడంతో ఆ షాడో ఎమ్మెల్యే రంగంలోకి దిగి, అధికారులందరినీ తన కంట్రోల్‌లోకి తెచ్చుకున్నాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ కేసు నుంచి బయటికి రావాలంటే ఎమ్మెల్యేతో మాట్లాడ్లాని, అందరినీ సెట్ చేసేందుకు భారీగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీనికి బాపురెడ్డి సహా ఆ 15.20 ఎకరాల్లో ఉన్న నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒప్పుకోలేదని కొన్నిరోజులుగా చర్చలు నడుస్తున్నాయి. వారు ఒప్పుకోకపోవడంతోనే పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారని, మళ్లీ ఆ షాడో ఎమ్మెల్యేనే ఏం తెలియనట్లు వచ్చి విడిపించుకొని వెళ్లారని చెబుతున్నారు. ఆ షాడో ఎమ్మెల్యేతో డీల్ సెట్ కాకపోవడంతోనే పోలీసులు అరెస్టు చేశారని, ఇది కూడా బెదిరింపుల్లో భాగంగా నాటకం మాదిరిగానే జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. అరెస్టు చేసిన వారిని పోలీసులు వదిలివేయడం కూడా ఈ వాదనకు బలం చేకూరుస్తున్నది.

### ఎమ్మెల్యే.. మాటకు కట్టుపడాలి..

శనిగకుంట మత్తడి పేల్చింది ఏ పార్టీవారైనా కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే వివేక్ సైతం స్పష్టం చేశారు. ఆ ప్రకటనకు ఆయన కట్టుబడి ఉండాలని.. ఎలాంటి ఒత్తిడిలకు తలొగ్గకుండా పారదర్శకంగా విచారణ సాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. విచారణకు కాంగ్రెస్ లీడర్లు అడ్డుపడకుండా పోలీసులు తమ పని తాము చేసే లా తన కేడర్‌కు సర్దిచెప్పుకొని ఇచ్చిన మాటపై నిలబడి చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల అండదండలతో రెచ్చిపోతున్న షాడో ఎమ్మెల్యేకు ఎమ్మెల్యే వివేక్ లొంగిపోవద్దని కోరుకుంటున్నారు. మొత్తానికి ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే వివేక్ గెలుస్తారా.. లేక షాడో ఎమ్మెల్యే తన పంతం నెగ్గించుకుంటారా వేచి చూడాల్సిందే. శనిగకుంట మత్తడి పేల్చివేత ఏమో కానీ ఆ దెబ్బతో చెన్నూర్ కాంగ్రెస్‌లో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయంటూ స్థానికులు అనుకుంటున్నారు.



మంచిర్యాలలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

## మహనీయుల చరిత్రను భావితరాలకు అందిద్దాం

- కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, కుమార్ దీపక్
- మంచిర్యాల, ఆసిఫాబాద్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

ఆసిఫాబాద్ టౌన్/నస్పూర్, సెప్టెంబర్ 27 : మహనీయుల చరిత్రను కాపాడుతూ భావితరాలకు అందించాలని కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్, మంచిర్యాల కలెక్టరేట్లలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా చోట్ల జిల్లా అదనపు కలెక్టర్లు దాసరి వేణు, మోతీలాల్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు సజీవన్, వినోద్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, పలు సంఘాల నాయకులు రాజయ్య, రూప్ నార్ రమేశ్, రేగుంట కేశవరావు పాల్గొన్నారు.

### హైదరాబాద్‌లో కోవ లక్ష్మి..

హైదారాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


ఆసిఫాబాద్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్సీ

## చేప పిల్లలు వేసేదెప్పుడో..!

- సమయం దాటుతున్నా స్పందించని సర్కారు
- చేప పిల్లల పంపిణీలో జాప్యం
- టెండర్లు నిర్వహించి పక్షం రోజులైనా ముందుకు సాగని ప్రక్రియ
- నిరాశలో మత్స్యకారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, సెప్టెంబరు 27 (నమస్తే తెలంగాణ) : మత్స్యకారుల ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లుతున్నట్లే కనిపిస్తోంది. జలాశయాల్లో చేప పిల్లలు వేయాల్సిన సమయం దాటిపోతున్నా సర్కారు స్పందించకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. జిల్లాలో 60 మత్స్య సహకార సంఘాలుండగా, 2750 మంది సభ్యులు ఉన్నారు. కుమ్రం భీం ప్రాజెక్టులో చేపలు పట్టుకునేందుకు మరో 350 మంది మత్స్యకారులు లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. జిల్లాలో ప్రత్యేక్షంగా, పరోక్షంగా దాదాపు 5 వేల కుటుంబాలు చేపల వేటను జీవనాధారంగా చేసుకొని జీవిస్తున్నాయి. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా గతేడాది కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలోని 244 చెరువులు, నాలుగు రిజర్వాయర్లలో కోటీ 38 లక్షల చేప పిల్లలను విడుదల చేసింది. చేప పిల్లల పంపెకం ద్వారా ప్రతి మత్స్యకారుడి కుటుంబానికి రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు ఆదాయం సమకూరింది. కానీ, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత చేప పిల్లల పంపిణీలో జాప్యమవుతున్నది. చేప పిల్లల పంపిణీకోసం మార్చిలో టెండర్లు నిర్వహించి.. ఆగస్టులో చేప పిల్లలను నీటి వనరుల్లో వేయాల్సి ఉంటుంది. చేప పిల్లల పంపిణీకోసం మార్చిలో నిర్వహించాల్సిన టెండర్లను అధికారులు సెప్టెంబర్ 11న నిర్వహించారు. ఆ ప్రక్రియ పూర్తయి పక్షం రోజులు దాటినా చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ముందుకు సాగకపోవడంపై మత్స్యకారుల కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. ఈనెల దాటిన తర్వాత చేప పిల్లలు వేసినా దిగుబడి తగ్గే ప్రమాదముందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## పట్టభద్రుల సంక్షేమానికి కృషి

**అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి**

నస్పూర్, సెప్టెంబర్ 27 : పట్టభద్రులైన ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి, వారి సంక్షేమానికి కృషి చేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనను పట్టభద్రులందరూ బలపర్చాలని కోరారు. శుక్రవారం మంచిర్యాలలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క అవకాశమిస్తే ఎమ్మెల్సీగా ప్రభుత్వం నుంచి వచ్చే జీతాన్ని సైతం గ్రాడ్యుయేట్స్ కోసమే ఖర్చు చేస్తానన్నారు. విద్యాసంస్థల అధినేతగా ఉపాధ్యాయుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ఏదైనా బాధ్యత తీసుకుంటే వెనక్కి తిరిగి చూసే అలవాటు లేదన్నారు. గతంలో జూనియల్ కళాశాలల అధ్యక్షుడిగా పని చేసి అనేక సమస్యలు పరిష్కరించానన్నారు. డబ్బు కోసమో, స్వలాభం కోసమో రాజకీయాల్లో రావడం లేదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఒక చదువుకున్న వ్యక్తి ఉంటే ఏం చేయగలరో చూపించాలనే పట్టుదలతో ప్రజా సేవ చేయడానికే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏ పార్టీ నుంచి పోటీ చేయాలన్నది ఇంకా నిర్ణయించుకోలేదన్నారు. 99 శాతం ఓ ప్రధాన రాజకీయ పార్టీ నుంచి పోటీ చేస్తానని, టికెట్ రాకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

## మెడికల్ కళాశాలలో సిబ్బందిని నియమించాలి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

ఆసిఫాబాద్ టౌన్,సెప్టెంబర్ 27 : జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలో పూర్తి స్థాయి సిబ్బందితో పాటు వైద్యులను నియమించాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య శాఖ సెక్రటరీ క్రిస్టియాన చోంగ్థుకు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ కళాశాలలో వైద్యులు, సిబ్బంది లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సామాజిక దవాఖానల్లో శాశ్వత ప్రాతిపదికన సూపరింటెండెంట్లను నియమించాలని కోరారు.


రాష్ట్ర వైద్య శాఖ సెక్రటరీ క్రిస్టియాన చోంగ్థుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

## డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాల తొలగింపు

మందమర్రి, సెప్టెంబర్ 27 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు మార్కెట్ ఏరియాలో డ్రైనేజీలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను శుక్రవారం అధికారులు తొలగింపజేశారు. పోలీసు బందోబస్తు నడుమ మున్సిపల్ అధికారులు, సిబ్బంది జేసీబీ సాయంతో నిర్మాణాలను కూల్చేశారు. వారం క్రితమే డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టగా, బాధితులు వారం గడువు కోరారు. వారం దాటినా వ్యాపారులు డ్రైనేజీలపై నిర్మాణాలను తొలగించక పోవడంతో అధికారులు రంగంలోకి దిగారు. కాగా, కొన్ని భవన సముదాయాల వెనకాల డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను తొలగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, టీపీవో తిరుపతమ్మ, రెవెన్యూ ఆఫీసర్ కృష్ణప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, ఇన్‌చార్జి ఆర్ఐ వసంత్ పాల్గొన్నారు.


మందమర్రిలో డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది